## క్లుప్తంగా

### బకాయిలు చెల్లించకుంటే బహిరంగ వేలం

- దుకాణదారులకు నోటీసులు అందజేస్తున్న కార్పొరేషన్ అధికారులు



దుకాణదారులకు నోటీసులు అందజేస్తున్న మున్సిపల్ సిబ్బంది

**విజయనగరం:** విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఆధీనంలో ఉన్న షాపుల లీజు దారుల దీర్ఘకాల బకాయిలను తక్షణమే చెల్లించాలని కమిషనర్ ఎం.ఎం.నాయుడు సూచించారు. ఈ మేరకు నగరంలో ఉన్న షాపుల దీర్ఘకాల బకాయిదారులకు శనివారం నోటీసులు అందించారు. మరికొన్ని దుకాణాలకు నోటీసులు అతికించారు. ఏడు రోజుల్లోగా బకాయిల మొత్తం చెల్లించాలని, లేకుంటే షాపులు బహిరంగ వేలంవేసి వేరొకరికి కేటాయిస్తామని చెప్పారు.

### ఘోష ఆస్పత్రి పరిశీలన



ఘోష ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

**విజయనగరం ఫోర్ట్:** జిల్లా కేంద్రంలోని ఘోష ఆస్పత్రిని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శనివారం పరిశీలించారు. ఆస్పత్రిలోని ఓపీ విభాగాలను, వార్డులను, లేబొరేటరీ, ఆపరేషన్ థియేటర్‌ను తనిఖీచేశారు. చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలని వైద్యాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంబంగి అప్పలనాయుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణశుభశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

### మంత్రిని కలిసిన శిష్టకరణ సంఘం సభ్యులు



మంత్రి కొండపల్లిని కలిసిన శిష్టకరణ సంఘం ప్రతినిధులు

**విజయనగరం టౌన్:** మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును విజయనగరం శిష్టకరణ సంఘం సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. జిల్లా అభివృద్ధికి పూర్తి సహాయ, సహకారాలందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సభ్యులు పరమేశ్వరరావు, జోగారావు, రమణారావు, మాజీ జిల్లా అధ్యక్షుడు ఎం.పి.తిరుపతిరావు, త్యాడ ప్రసాద్ పట్నాయక్, లోచర్ల శ్రీనివాస్, త్యాడ రామకృష్ణ పాల్గొన్నారు.

### బోరు ప్రారంభం



బోరును ప్రారంభిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు సంతోష్‌బాబు

**నెల్లిమర్ల:** జల్‌జీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ కుళాయి నీటి సరఫరాలో భాగంగా మొయిద గ్రామ శివాలయం వద్ద వేసిన అదనపు బోరును ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, మాజీ సర్పంచ్ యడ్ల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లు అందిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, తదితరులు

**డెంకాడ:** మండలంలోని మోపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్‌లను ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఇతర ప్రజాప్రతినిధులు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, మోపాడ జెడ్పీ పాఠశాల, కేజీబీవీ, మోపాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల–1,2లకు చెందిన విద్యార్థులకు కిట్లు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బద్దుకొండ రమేష్, ఉప సర్పంచ్ బి.సత్యంనాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బంటుపల్లి మురళి, గ్రామపెద్దలు బి.విజయ్‌కుమార్, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ సుజాత, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నాగకుమార్, తదితరులు పాల్గొన్నారు.

# పెంపుడు జంతువులకు టీకాలు





కుక్క పిల్లలను తీసుకు వస్తున్న సంరక్షకులు



రేబిస్ నిరోధక టీకా వేస్తున్న డాక్టర్, పక్కన కమిషనర్ మల్లయ్య నాయుడు

**విజయనగరం ఫోర్ట్:** సంక్రమిత వ్యాధుల బారిన పడకుండా మూగజీవాలను రక్షించేందుకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.వి.రమణ సూచించారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా విజయనగరం బహుళార్థ పశు వైద్యశాలలో పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ నిరోధక టీకాలు శనివారం వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెంపుడు జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించకుండా జంతు ప్రేమికులు, సంరక్షకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటికి సకాలంలో టీకాలు వేయించాలన్నారు. జంతువుల నుంచి మనకు తెలియకుండానే రేబిస్, మెదడు వాపు, ఆంత్రాక్స్ వంటి అనేక రకాల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, పశు సంవర్ధక శాఖ డీడీ మహాలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సూర్యానారాయణ, సహాయ సంచాలకులు డాక్టర్ కె.వి.రమణ, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ ధర్మారావు, డాక్టర్ శశిభూషణరావు, పశు వైద్యులు లలిత, మోహన్, వర్మ తదితరులు పాల్గొన్నారు.



కుక్కలకు టీకాలు వేయించేందుకు క్యూ కట్టిన పెంపకం దారులు



శునక సంరక్షకులకు మందులు అందజేస్తున్న కార్పొరేషన్ కమిషనర్ మల్లయ్యనాయుడు



కుక్కకు టీకా వేసేందుకు పేరు నమోదు

## పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు



భోగాపురం: పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి ఉమాశంకర్ మహాపాత్రో

**భోగాపురం/డెంకాడ:** ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని భోగాపురం మండంలోని ముంజేరు, భోగాపురం, డెంకాడ మండలంలోని అక్కివరం గ్రామంలోని పశువైద్య కేంద్రాల్లో పెంపుడు కుక్కలకు పశువైద్యులు ఉమాశంకర్ మహాపాత్రో, యు.రామరాజు, శ్రీకాంత్ శనివారం రేబిస్ వ్యాక్సిన్‌లు వేశారు. ఈసందర్భంగా పశువైద్యాధికారులు మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండా లని సూచించారు. పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించాలని, ఈ విషయంలో యజమానులు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ సుమన్‌కాంత్, పశుసంవర్ధక సహాయకులు వెంకటేష్, పుష్ప, దేవి, గోపాలమిత్ర గోపి, అక్కివరం గ్రామ సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.



డెంకాడ: అక్కివరంలో పెంపుడు కుక్కకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

# జై జగన్నాథ్!

- రథయాత్రకు సర్వం సిద్ధం
- ఏర్పాట్లు పూర్తిచేసిన దేవదాయశాఖ అధికారులు
- ఆదివారం వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు

**విజయనగరం టౌన్:** జగన్నాథుని రథచక్రాలు కదలనున్నాయి. జిల్లా కేంద్రంలోని నాలుగు చోట్ల రథయాత్ర మహోత్సవాలకు రంగం సిద్ధమైంది. ఆదివారం వేకువజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సంతపేట జగన్నాథ స్వామి ఆలయం వద్ద ఉదయం 7.30 గంటలకు స్వామివారిని రథంపై ఉంచి భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు శనివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆలయం నుంచి మేళతాళాలు, కోలాటాలు, డప్పు వాయిద్యాలు, గోవిందనామస్మరణతో రథయాత్ర కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు సాగుతుందన్నారు. రాత్రి 10 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి ఇంద్రజుమ్న మందిరానికి చేరుకుంటుందన్నారు. దాసన్నపేట, మూడుకోవెళ్లు, అనాసరపువారి వీధిలో రథాలపై జగన్నాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నారని ఆలయ అధికారులు స్పష్టం చేశారు. దర్శనాల అనంతరం స్వామివారిని ఆయా ప్రదేశాల్లో ఉన్న ఇంద్రజుమ్న మందిరాలకు తరలిస్తామన్నారు. భక్తులందరూ స్వామివారిని దర్శించి, తరించాలని కోరారు.



రథయాత్రకు ముస్తాబైన రథం



సంతపేటలో జగన్నాథస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు



దాసన్నపేటలో జగన్నాథస్వామి వారి ఆలయం

## డీసీసీబీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం

- రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం అర్బన్:** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. బ్యాంక్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు నాబార్డు సహకారంతో డీసీసీబీ ఏర్పాటు చేసిన రెండు సంచార వాహనాలను బ్యాంక్ ఆవరణలో శనివారం ఆయన ప్రారంభించారు. అంతర్జాతీయ సహకార దినత్సోవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ బ్యాంక్ ప్రగతిని పరిశీలిస్తే గడచిన పదేళ్లలో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. జిల్లా సహకార అధికారి పి.రమేష్ మాట్లాడుతూ సహకార బ్యాంకుకు అనుబంధంగా జిల్లలో 65 ప్రాథమిక సహకార సంఘాలు పనిచేస్తున్నాయని చెప్పారు. వీటిలో 11 సంఘాలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని, మిగిలిన వాటిని లాభాలబాట పట్టించాల్సిన అవసరం ఉందిన చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పి.అదితిగజపతిరాజు, కేసీ కె.కార్తీక్, నాబార్డు డీడీఎం టి.నాగార్జున, డీసీసీబీ ఇన్‌చార్జి సీఈఓ సీహెచ్.ఉమామశ్వరరావు, జనరల్ మేనేజర్ కేవీఎస్ఆర్ సత్యనారాయణ, సబల రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షురాలు సరస్వతి, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సంచార వాహనాలను ప్రారంభిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి

# పోలీసులకు ప్రశంసలు



ప్రశంసాపత్రాలు అందుకున్న సిబ్బందితో వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

**విజయనగరం క్రైమ్:** జిల్లాలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన వన్‌టౌన్ పోలీస్ అధికారులు, సిబ్బందిని అభినందిస్తూ ఎస్పీ ఎం.దీపిక అందజేసిన ప్రశంసపత్రాలను వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు శనివారం సిబ్బందికి అందజేశారు. అభినందనలు తెలిపారు. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించిన వారికి గుర్తింపు, గౌరవం లభిస్తుందన్నారు.

## కాపర్ వైర్ చోరీ



కాపర్ వైర్ చోరీ చేసినసన ట్రాన్స్‌ఫార్మర్ ఇదే

**పూసపాటిరేగ:** మండలంలోని కుమిలి గ్రామంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామానికి చెందిన వీరాపు రమణ, వీరాపు వెంకాయమ్మ పొలాల్లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు చెందిన ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఇందులోని కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఇటీవల కాలంలో ఇటువంటి దొంగతనాలు ఎక్కువవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

# సేవలకు గుర్తింపు



సాధించిన అవార్డులతో రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ప్రతినిధులు

**విజయనగరం:** రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో ఈ ఏడాది చేపట్టిన సేవా, సంక్షేమ కార్యక్రమాలకు అవార్డులు లభించాయని క్లబ్ అధ్యక్షుడు వి.వి.రాజేష్ తెలిపారు. పట్టణంలోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన క్లబ్ సమావేశంలో అవార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఇప్పటివరకు తమ క్లబ్ ద్వారా విజయనగరం పట్టణంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించామని, ప్రభుత్వ పాఠశాలల్లో మినీవాటర్ ప్లాంట్‌లు ఏర్పాటుచేశామని చెప్పారు. వివిధ సేవలకు గాను 39 అవార్డులు లభించాయన్నారు. రోటరీ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే వివిధ సేవా కార్యక్రమాలకు క్లబ్ నుంచి రూ.28 లక్షలు అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రెటరీ అరుణ్‌కుమార్ సాధాని, ప్రతినిధులు జి.శివకుమార్, ఆర్.శంకర్‌రెడ్డి, జయకృష్ణ, జీఎస్ గుప్త, డాక్టర్ సునీత, కాపుగంటి శ్రీనివాస్, ఫాస్ట్ గవర్నర్ ఎం.రామారావు, బత్తుల చందు, తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో కార్మికనాయకుడు మృతి



ఉమామహేశ్వరరావు (ఫైల్)

**నెల్లిమర్ల:** స్థానిక జూట్ మిల్లు కార్మిక సంఘ నాయకుడు, రిటైర్డ్ జూట్ కార్మికుడు ఉరిటి ఉమామహేశ్వరరావు(74) గుండె పోటుతో గాంధీ నగర్ కాలనీలోని స్వగృహంలో శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. జూటు మిల్లుకు ఇప్పూ సంఘాన్ని తీసుకురావడంలో ఆయన కృషి ఎనలేనిదని కార్మికులు తెలిపారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన మృతిపై సీపీఎం నాయకులు రెడ్డి శంకరరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, జి.అప్పలసూరి, జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి కె.దివాకర్, ఏఐటీయూసీ నాయకులు మొయిద పాపారావు సంతాపం తెలిపారు.

## ప్రధాన సమస్యలపై దృష్టి



గ్రామసభలో పాల్గొన్న అధికారులు, గ్రామ పెద్దలు

**భోగాపురం:** గ్రామంలో నెలకొన్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని ఇన్‌చార్జ్ ఈఓ మంగం సురేష్ అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలువల్లో పూడికతీత పనులు, పారిశుధ్యం, తదితర సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో పడాల భానుప్రకాష్, కొమ్మూరు సుభోషణరావు, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, గుండపు నానాజీ, అళ్ల విశ్వేశ్వరరావు, ఉదయబాబు, ఈఓపీఆర్డీ సురేష్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎంపీ కలిశెట్టికి ఘన స్వాగతం

**భోగాపురం:** ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి మొదటిసారి జిల్లాకు విచ్చేసిన కలిశెట్టి అప్పలనాయుడుకు మండలంలోని రాజాపులోవ వద్ద నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు, తదితరులు శనివారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ అప్పలనాయుడు కాసేపు సైకిల్ తొక్కుతూ అభిమానులను అలరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, కర్రోతు సత్యనారాయణ, కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును పూలదండతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు

# మస్తర్లలో దిద్దుబాట్లు



ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

- ప్రజావేదికలో వెల్లడించిన ఆడిట్ బృందాలు

**డెంకాడ:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి వేతనదారుల మస్తర్లలో దిద్దుబాట్లను గుర్తించామని సోషల్ ఆడిట్ అధికారులు, సిబ్బంది తెలిపారురు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, అంబుడ్స్‌పర్సన్ అన్నపూర్ణమ్మ, ఏపీడీ జనార్ధన్, ఎంపీడీఓ లవరాజు, తదితరుల ఆధ్వర్యంలో జరిగిన ప్రజావేదికలో 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులు, ఖర్చులు, తదతర వివరాలను ఆడిట్ బృందాలు వివరించాయి. పలు గ్రామాల్లో మస్తర్లు దిద్దుబాటుతో పాటు బినామి మస్తర్లు వేసినట్టు వేదిక దృష్టికి తీసుకువచ్చారు. పాస్ ఆర్డర్లు లేకుండా బిల్లులు చెల్లించారని.. కొలతల్లో తేడాలు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారులు స్పందిస్తూ అవకతవకలకు పాల్పడిన సిబ్బంది వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

## రహదారులను ఆక్రమిస్తే చర్యలు



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

**విజయనగరం:** నగరంలోని రద్దీ ప్రాంతాల్లో రహదారులను ఆక్రమించి ప్రజలకు అసౌకర్యం కలిగించే చిరు వ్యాపారులపై చర్యలు తప్పవని కార్పొరేషన్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు హెచ్చరించారు. ప్రధాన రహదారులపై వ్యాపారాల నిర్వహణతో ఇబ్బందులు కలుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు ప్రధాన రహదారులను సిబ్బందితో కలిసి శనివారం పర్యవేక్షించారు. రహదారులపై వ్యాపారాలు చేసేవారిని మందలించారు. అన్నా క్యాంటీన్ ముందు చిరు వ్యాపారులు పూర్తిగా ఆక్రమించడాన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడి రామమూర్తి పార్కు, గాంధీ పార్కు ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి ఉండడంతో వ్యాపారులను మందలించి రోడ్లపై ఉన్న సామగ్రిని తొలగించి వేశారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రామారావు, పాల్గొన్నారు.